క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు



రేపల్లె రూరల్: మండలంలోని పోటుమెరక గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణంలో అర్చకులు మహేష్ భక్తులతో సామూహిక అష్టోత్తర శతనామ పూజలు నిర్వహించారు. స్వామివారిని పూజించే ముక్తిని పొందే మార్గాలను ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు వివరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం చేసి గోవింద నామాలను జపించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మండల కన్వీనర్ పేరం కోటేశ్వరరావు, సభ్యులు చెంచయ్య, శ్రీకృష్ణయ్య, బొలిముంత సుందరరామిరెడ్డి, కామయ్య పాల్గొన్నారు.

రేపు కార్తిక వన సమారాధన



భట్టిప్రోలు: ఐలవరం గ్రామ దేవత పైడమ్మ తల్లి దేవాలయ ఆవరణలో ఈ నెల 11న 14వ వార్షిక కార్తిక మాస వన సమారాధన ఘనంగా నిర్వహించనున్నట్లు భక్త బృందం శనివారం తెలిపింది. ఆ రోజు అమ్మవారికి అయ్యప్ప స్వాముల పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పద్మశాలీయ పురోహిత సంఘం అధ్యక్షుడు గోలి ధర్మారావు అమ్మవారికి పూజా కార్యక్రమాలు జరుపుతారని తెలిపారు.

స్వామియే శరణమయ్యప్ప



వెల్లటూరు(భట్టిప్రోలు): శరణమయ్యప్ప నామ స్మరణతో వెల్లటూరు గ్రామం మారు మోగింది. స్థానిక శ్రీ కట్లమ్మ తల్లి దేవస్థానంలో పడి పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురుస్వామి గుంటుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామి వారికి 18 రకాల అభిషేకాలు శాస్త్రోక్తంగా జరిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి, ఆయా మండలాల నుంచి అయ్యప్ప, శివ స్వాములు, భవానీలు విచ్చేసి హోమ గుండం నిప్పులపై నడిచారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. గోలి చంద్రయ్య పర్యవేక్షించారు.

పోలీసుల అదుపులో లిక్విడ్ గంజాయి విక్రేతలు!

గుంటూరు రూరల్: లిక్విడ్ గంజాయి విక్రేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇటీవల నగరంలోని పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి బ్యాచ్ పోలీసులకు పట్టుబడిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తీగలాగితే డొంక కదిలినట్లు పోలీసుల విచారణలో స్వర్ణభారతీనగర్‌కు చెందిన యువతి, యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. అక్రమార్కులకు విద్యార్థులే టార్గెట్‌గా చేసుకున్నారు. గంజాయిని నేరుగా విక్రయిస్తే వాసనకు అందరికి తెలుస్తుందని గమనించిన అక్రమార్కులు గంజాయిని తెచ్చి దానితో లిక్విడ్‌ను తయారు చేసి చిన్నచిన్న బాటిల్స్ ద్వారా విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం.

వైద్యులు పనితీరు మార్చుకోవాలి



కాకుమాను: వైద్యులు తమ పనితీరు మార్చుకుని పనిచేయాలని పల్నాడు జిల్లా డీఎంహెచ్ఓ రవి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే ఓ వైద్యుడిపై రాష్ట్ర ఆరోగ్యశాఖకు ఫిర్యాదు రావడంతో విచారణ నిమిత్తం వచ్చినట్లు చెప్పారు. వైద్యులు నిబద్ధతతో పని చేయాలని సూచించారు. నివేదికను రాష్ట్ర ఆరోగ్యశాఖకు పంపనున్నట్లు తెలిపారు.

నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

కాకుమాను: మండలంలోని కొండపాటూరులో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు యార్లగడ్డ జయప్రద, రామయ్య చారిటీస్ వ్యవస్థాపకుడు యార్లగడ్డ అంకమ్మ చౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చారిటీస్‌తో పాటు జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో శంకర కంటి ఆస్పత్రి వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

వేగంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు



స్మార్ట్ మీటర్



పట్టణంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

రేపల్లె రూరల్: రేపల్లె పట్టణంలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ వేగంగా జరుగుతోంది. మూడు బృందాలు పట్టణంలో విస్తృతంగా పర్యటిస్తూ స్మార్ట్ మీటర్లను అమర్చుతున్నాయి. తొలి విడతగా ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ వేగంగా జరుగుతోంది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో వినియోగదారులకు అనేక ఉపయోగాలు ఉన్నాయంటూ విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అయితే స్మార్ట్ మీటర్లతో వినియోగదారులకు నష్టమేనంటూ ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. డిసెంబర్ వరకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ సాగుతుందని అప్పటి వరకు పాత పద్ధతిలోనే విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొంటున్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తయిన తరువాత మీటర్లపై వినియోగదారులకు అవగాహన కల్పించి, జనవరి నుంచి ప్రీ పెయిడ్ విధానం అమలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

స్మార్ట్ మీటర్లు తప్పనిసరి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం ప్రతి ఒక్కరూ స్మార్ట్ మీటర్లను అమర్చుకోవాలి. రేపల్లె డివిజన్‌లోని ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ వేగంగా జరుగుతోంది. వ్యాపార సంస్థ ప్రక్రియ ముగిసిన వెంటనే గృహ వినియోగదాలకు మీటర్లను ఏర్పాటు చేస్తాం. స్మార్ మీటర్ల ఏర్పాటుతో వినియోగదారులకు పలు రకాల ఉపయోగాలు ఉన్నాయి.

– సురేష్‌బాబు, డీఈఈ, రేపల్లె

వైభవంగా కోటి సోమవార వేడుకలు



చెన్నమల్లేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో భ్రమరాంబ అమ్మవారు



ఉమామహేశ్వర స్వామి

రేపల్లె రూరల్: పవిత్ర కార్తిక మాసం శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించే కోటి సోమవార వేడుకలను శనివారం పట్టణంలోని పలు దేవాలయాల్లో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓల్డ్ టౌన్‌లోని ఉమా మహేశ్వరస్వామి ఆలయం, ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి ఆలయం, రైలుపేటలోని స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయంలో వేకువజాము నుంచి సుప్రభాత సేవలతో అభిషేక మహోత్సవాలు నిర్వహించారు. స్వామివార్ల మూల విటార్‌లను ప్రత్యేకంగా అలంకరించి ఉమ్మెత్త పూలు, మారేడు దళాలు, కలువ పూలు, మందారాలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు వేకువ జామునే ఆలయాలకు చేరుకుని కార్తిక దీపాలు వెలిగించి స్వామివార్లకు మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయాల కమిటీల నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

జోరుగా రేషన్ బియ్యం వ్యాపారం



కూచిపూడి రైస్ మిల్లు వద్ద రేషన్ బియ్యం వాహనం పట్టుకున్న పోలీసులు

అమర్తలూరు(వేమూరు) : రేషన్ బియ్యం కొనుగోలుకు కూచిపూడి రైస్ మిల్లు అడ్డగా మారింది. మండల కేంద్రంలోని రేషన్ బియ్యం వ్యాపారస్తులు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పూర్తి సహకారంతో బియ్యం వ్యాపారం చేస్తున్నామని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ బియ్యం అక్రమంగా తరలించే ముఠా రంగంలోకి దిగింది. ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు, భట్టిప్రోలు మండల కేంద్రంలోని టీడీపీ నాయకుడు ఏజెంట్‌లను ఏర్పాటు చేసి, ప్రతి నెలా ఎమ్మెల్యేకు రూ.5 లక్షలు చెల్లించడం జరుగుతుందని విమర్శలు వినిపిస్తున్నాయి. వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో రేషన్ బియ్యం అక్రమంగా తరలించే ఏజెంట్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ప్రభుత్వం రేషన్ బియ్యం పంపిణీ చేస్తోంది. ప్రతి గ్రామంలో రేషన్ బియ్యం కేజీ 9 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారు. వీరి నుంచి రైస్ మిల్లు యాజమాన్యం రూ.18లు కొనుగోలు చేస్తుంది. ప్రతి మండలం నుంచి వందల క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్నారు. అమర్తలూరు ఎస్ఐ జానకి అమర్ వర్ధన్ శుక్రవారం రాత్రి 2 గంటల తర్వాత కూచిపూడి రైస్‌మిల్లు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. ముఖ్యంగా తెనాలి నియోజక వర్గం పక్కన కూచిపూడి గ్రామంలో రైస్ మిల్లు రేషన్ బియ్యం వ్యాపారం జోరుగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యేల అండదండలతో వ్యాపారం సాగుతుందని ప్రజలు చెబుతున్నారు. రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులకు ప్రతి నెలా మాముళ్లు చెల్లించడం జరుగుతుందని ఏజెంట్లు చెబుతున్నారు.

సకురా సైన్స్ ప్రాజెక్ట్- 2024కు విజ్ఞాన్ అధ్యాపకులు ఎంపిక



అధ్యాపకులను అభినందిస్తున్న వైస్ చాన్సలర్ నాగభూషణ్, రిజిస్ట్రార్ రఘునాథన్

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకు చెందిన ఇద్దరు అధ్యాపకులు జపాన్‌లోని సకురా సైన్స్ ప్రాజెక్ట్-2024కు ఎంపికయ్యారని వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ శనివారం తెలిపారు. విజ్ఞాన్ యూనివర్సిటీ బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్లు ఎస్.ఎస్.సంపత్ కుమార్, చింతగుంట అంజనీ దేవి జపాన్ దేశం టోక్యోలోని జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ (జేఎస్టీ) ఏడు రోజుల పాటు యూనివర్సిటీ ఆఫ్ మియజాకీలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ''సకురా ప్రాజెక్ట్-2024''కు ఎంపికయ్యారని వీసీ తెలిపారు. నవంబర్ 10 నుంచి 16వ తేదీ వరకు కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్ట్‌కు ఎంపికైన అధ్యాపకులను వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్‌తో పాటు రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ అభినందించారు.

తెనాలిలో 'జగ్జీవన్ రామ్' సినిమా షూటింగ్

- బాబు జగ్జీవన్ రామ్ బయోపిక్ షెడ్యూలు షూటింగ్ ప్రారంభం
- భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్ పాత్రల్లో ఇద్దరు ఎమ్మెల్యేలు



జగజ్జీవన్‌రామ్, భగత్‌సింగ్, నేతాజీ పాత్రధారులపై క్లాప్ నిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

తెనాలి: స్థానిక రత్న ఫార్చ్యూన్ కళ్యాణ మండపం ఆవరణలో బాబూ జగజ్జీవన్‌రామ్ చలనచిత్రం రెండో షెడ్యూలు రెగ్యులర్ షూటింగ్ శనివారం ఉదయం ప్రారంభమైంది. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే జి.రామాంజనేయులు, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు కేసన శంకరరావు పాల్గొని వివిధ సన్నివేశాలకు నటీనటులపై క్లాప్ కొట్టారు. టైటిల్ పాత్ర బాబు జగజ్జీవన్‌రామ్ పాత్రలో మిలటరీ ప్రసాద్, భగత్ సింగ్ గా ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, చంద్రశేఖర్ ఆజాద్‌గా పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర నటిస్తున్నట్టు దర్శకుడు దిలీప్‌రాజా వెల్లడించారు. సాయంత్రం వీరిపై కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. తొలుత నరసింహరాజు, కావ్యకీర్తిపై సన్నివేశాన్ని తీయగా, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు క్లాప్‌కొట్టారు. వీరితోపాటు బి వెంకటస్వామి నాయుడు, అరవిందరాజా నటిస్తున్నారని, దర్శకుడు దిలీప్ రాజా సాయంత్రం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తాజా షెడ్యూలులో బాబు జగజ్జీవన్ రామ్ స్వాతంత్ర ఉద్యమంలో పోషించిన పాత్ర, రాజకీయ నేపథ్యం వంటి స్ఫూర్తిదాయకమైన అంశాలను తెరకెక్కిస్తున్నట్లు తెలిపారు. జగజ్జీవన్‌రామ్ బయోపిక్‌లో ఆరుగురు ఎమ్మెల్యేలు నటిస్తున్నారని, షూటింగ్ నిరవధికంగా కొనసాగుతుందని వివరించారు. చిత్రానికి డీఓపీగా మురళీకృష్ణ, కెమెరామెన్ వంశీ, ఆర్ట్ డైరెక్టర్ రత్నాకర్ కసపర్తి, ప్రొడక్షన్ ఇన్చార్జి శ్రీకాంత్, మేకప్ జనార్ధన్, లైటింగ్ మణి, ప్రొడక్షన్ షేక్ హాజీ, పి రమేష్ వ్యవహరిస్తున్నట్టు వివరించారు.

అరుదైన పుష్పం



భట్టిప్రోలు: మండలంలోని పెదపులివర్రు-పెసర్లంక రహదారి మార్గంలోని నాగలింగం చెట్టుకు పూలు పూసి విశేషంగా ఆకర్షిస్తున్నాయి. కొమ్మలకు కాకుండా చెట్టు మొదలకు పూయడం వీటి ప్రత్యేకత. ఈ పూలు శివలింగానికి నాగ పడగతో నీడ పట్టిన ఆకారంలో ఉంటాయి. వీటితో శివుడిని ఆరాధిస్తే బిల్వ, మారేడు పత్రాలతో పూజ చేసినంత ప్రతిఫలం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఈ చెట్టుకు పదేళ్ల వయస్సు తరువాత ఈ పూలు పూస్తాయి. ఆ తర్వాత ఏడాదికోసారి పూలు పూస్తాయి. ఎంతో సువాసన వెదజల్లుతాయి.

మహిళా చట్టాలపై అవగాహన తప్పనిసరి

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

రేపల్లె రూరల్: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియరల్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ టి.వెంకటేశ్వర్లు తెలిపారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం అంగన్‌వాడీలకు, ఆయాలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మనోవర్తి, స్త్రీలకు ఆస్తిలో హక్కు, ఉచిత న్యాయ సలహా సేవలు, లోక్ అదాలత్, గృహ హింస చట్టాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కొండపల్లి శ్రీనివాసరావు, మధుసూదనరావు, రాంబాబు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

రేపల్లె రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలోని గంగడిపాలెంలో చోటుచేసుకుంది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్ వివరాల మేరకు తమకు అందిన సమాచారంతో గ్రామంలో దాడులు నిర్వహించగా గ్రామానికి చెందిన లంకె కృష్ణమోహన్ గ్రామంలోని రామాలయం వద్ద మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. కృష్ణమోహన్ నుంచి 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్

కొల్లూరు(వేమూరు): మద్యం బెల్టు షాపు నిర్వాహకుడిని అరెస్ట్ చేసామని ప్రొహిబిసన్ ఎక్సైజ్ సీఐ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొల్లూరు మండలంలోని జువ్వలపాలెం గ్రామానికి చెందిన బెల్టు షాపు నిర్వాహకుడు మద్యం బాటిల్ విక్రయిస్తుండగా పట్టు కోవడం జరిగిందన్నారు. అతని వద్ద 8 మద్యం బాటిల్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

నేడు ఓటు అభ్యంతరాలపై ప్రత్యేక శిబిరం



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్ జియావుల్ హక్

పొన్నూరు: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో ఇటీవల ప్రదర్శించిన ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఆదివారం నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో తెలియజేయాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు. శనివారం పలు పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి సిబ్బంది పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు బీఎల్ఓలు అందుబాటులో ఉంటారని తెలిపారు. 18 సంవత్సరాలు నిండి అర్హత కలిగిన యువత కొత్తగా ఓటు నమోదు చేసుకొనుటకు ఫారం-6, ఓటు తొలగించుకోవాల్సిన వారు ఫారం- 7, ఓటు సవరణ, బదలాయింపు చేసుకునే వారు ఫారం-8 లను దాఖలు చేయాలని సూచించారు.

కేంద్ర, రాష్ట్ర విధానాలతో ప్రజలకు తప్పని తిప్పలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు రమాదేవి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యురాలు రమాదేవి

రేపల్లె రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి అన్నారు. పట్టణంలోని మైనేని సీతారామయ్య కల్యాణ మండపంలో శనివారం జరిగిన సీపీఎం పట్టణ 2వ మహాసభలకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. రాజకీయ స్వార్థంతో పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల నిత్యావసర ధరలు అదుపు తప్పాయన్నారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు చితికిపోతున్నారన్నారు. పేదల పక్షాన సీపీఎం నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. కమ్యూనిస్ట్ ఉద్యమాలకు పురిటిగడ్డ రేపల్లె ప్రాంతంలో వారసత్వాన్ని కొనసాగిస్తూ ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చి హామీలను అమలు చేయటంతో పాటు ధరలను అదుపులోకి తీసుకురావాలన్నారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.7 వేల కోట్ల భారాన్ని మోపడం దుర్మార్గమన్నారు. ఈ సందర్భంగా అమరులైన సీపీఎం నాయకులు సీతారాం ఏచూరి, రేపల్లె ప్రాంత పార్టీ సభ్యులు అమిరినేని లక్ష్మయ్యకు నివాళులర్పిస్తూ మౌనం పాటించారు. అనంతరం నూతన సీపీఎం రేపల్లె పట్టణ నూతన కమిటీని ఏడుగురు సభుయలతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సిహెచ్ మణిలాల్, సభ్యులుగా కె.ఆశీర్వాదం, కేవీ లక్ష్మణరావు, జె.ధర్మరాజు, ఎన్.శివశంకర్, కె.ఝాన్సీ, బి.నాగరాజును ఎన్నుకున్నారు. నాయకులు వై.కిషోర్, కె.రమేష్, కె.వెంకట్ ఎన్నికయ్యారు.

బీఎల్వోలు నిబద్ధతతో పనిచేయాలి



పోలింగ్ బూత్‌లను పర్యవేక్షిస్తున్న ఆర్డీవో నేలపు రామలక్ష్మి

రేపల్లె రూరల్: సమగ్రమైన ఓటర్ల జాబితాను రూపొందించడంలో బీఎల్వోలు నిబద్ధతతో పని చేయాలని ఆర్డీవో నేలపు రామలక్ష్మి పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంప్‌లను శనివారం రేపల్లె, చెరుకుపల్లి మండలంలోని పలు పోలింగ్ బూత్‌లను పర్యవేక్షించారు. ఓటు హక్కు నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగించాలని ఎలక్షన్ కమిషన్ నిర్ణయించినట్లు చెప్పారు. జనవరి నాటికి సంపూర్ణ ఓటర్ల జాబితాలను ప్రచురించడమే ధ్యేయంగా ప్రత్యేక క్యాంప్‌లు జరుగుతున్నాయన్నారు. నవంబర్ 29వ తేదీ వరకు సవరణకు దరఖాస్తులు స్వీకరించడంతో పాటు వచ్చిన అభ్యంతరాలపై పూర్తిస్థాయిలో విచారించాలన్నారు. ఈ సందర్భంగా రేపల్లె పట్టణం, మండలంలోని పలు కేంద్రాలతో పాటు చెరుకుపల్లి మండలంలోని పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, రెవిన్యూ సిబ్బంది తదితరులున్నారు.

దేవాలయాల్లో శ్రవణా నక్షత్ర పూజలు



14వ శతాబ్దం నాటి శివలింగం

భట్టిప్రోలు: వ్యాఘ్రపురి క్షేత్రమైన పెదపులివర్రులో స్వయంభువుగా కొలువైన రాజరాజ నరేంద్రస్వామికి కార్తిక మాసం శ్రవణా నక్షత్రం సోమవారం సందర్భంగా శనివారం ప్రాతఃకాలంలో ప్రత్యేక పూజలు జరిపారు. తెల్లవారు జామునే భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి దేవాలయాలలో స్వామి వార్లను దర్శించుకున్నారు. వ్యాఘ్రపాద మహర్షిచే కొలువైన స్వామి వారికి ఈ కార్తిక మాసంలో ప్రత్యేక పూజలు, నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్నారు. అలాగే మండల కేంద్రమైన భట్టిప్రోలులో కొలువైన మల్లేశ్వరస్వామి ఆలయంలో కూడా నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. రథం గుడిగా పేరొందిన ఈ ఆలయంలోని శివలింగంకు ఎంతో ఘన చరిత్ర ఉంది. 14వ శతాబ్దం నాటి శివలింగంగా ప్రసిద్ధిగాంచింది. పెదపులివర్రు గ్రామదేవత గోగులమ్మతల్లి అమ్మవారి ఆలయంలో శ్రవణా నక్షత్ర యుక్త శుద్ధ అష్టమి పురస్కరించుకుని కాలభైరవ స్వామి వారికి విశేష అష్టోత్తర నామార్చన పూజలు నిర్వహించారు.

మహిళపై అత్యాచార యత్నం అవాస్తవం

ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి

నిజాంపట్నం: మహిళపై అత్యాచార యత్నం అవాస్తవమని అడవులదీవి ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. నిజాంపట్నం మండలం జంపనివారిపాలెంలో 45 సంవత్సరాల క్రితం బెల్లంకొండ పూర్ణ కుటుంబీకులు తుపాను షల్టర్ ఏర్పాటుకు కొంత స్థలాన్ని అందించడం జరిగిందన్నారు. ఆ స్థలంలో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరడంతో ఆ భవనంను కొన్నాళ్ల క్రితం తొలగించారు. తిరిగి ఆ భూమిని స్వాధీనపరుచుకోవాలని పూర్ణ ఆ గ్రామానికి వెళ్లడంతో గ్రామస్తులకు, పూర్ణకు మధ్య వివాదం తలెత్తిందని తెలిపారు. పూర్ణ తనపై ఇరువురు వ్యక్తులు దాడి చేశారంటూ తమకు పిర్యాదు చేయటంతో గ్రామంలో పూర్తి స్థాయిలో విచారణ చేశామన్నారు. పూర్ణ, ఆమె కుమారుడు స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుకోవటంతో తమపై దాడి చేశారంటూ పిర్యాదు చేసినట్లు వెల్లడించారు. అయితే పలు సోషల్ మీడియా వేదికలపై మహిళపై అత్యాచారం జరిగినట్లు వచ్చిన కథనాలు అవాస్తవమన్నారు.

తక్కువ ఖర్చుతో మెరుగైన చికిత్స

ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్

చేబ్రోలు: సరైన ఔషధ వినియోగం ద్వారా హాస్పిటల్ వ్యయాన్ని తగ్గించి, రోగులకి తక్కువ ఖర్చుతో మెరుగైన చికిత్స అందించవచ్చునని యూఎస్ఏ-ఓహాయోలోని యూనివర్సిటీ ఆఫ్ ఫిండ్లే ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో 'క్లినికల్ ఫార్మసీ ప్రాక్టిస్ అండ్ రీసెర్చ్' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన కాన్ఫరెన్స్ శనివారం ఘనంగా ముగిసింది. ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ క్లినికల్ ఫార్మసీ అనేది వైద్యరంగంలో రోగులకు సమర్ధంగా ఔషధ చికిత్స అందించడంలో సహకరిస్తుందని చెప్పారు. ఫార్మసిస్టులు వైద్యులతో కలసి పనిచేస్తూ, రోగులకు సరైన మందులు, సరైన మోతాదు, మరియు సరైన చికిత్స అందించడంలో కీలక పాత్ర పోషిస్తారని వెల్లడించారు. ముంబాయిలోని ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సిటీ ప్రో-వైస్ చాన్సలర్ మీన చింతమనేని మాట్లాడుతూ నూతన సాంకేతికతలను ఉపయోగించి భారతదేశంలోని ప్రత్యేక పరిస్థితులలో రోగుల ఆరోగ్యం పెంపొందించేందుకు కొత్త మార్గాలను అన్వేషించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. యూఎస్ఏలోని అవినిడా సొల్యూషన్స్ సీఈఓ కార్తీక్ రాకమ్ మాట్లాడుతూ క్లినికల్ ఫార్మసీ పరిశోధనల ద్వారా వ్యాధులపై అవగాహన పెరిగి, అనవసర ఔషధ వినియోగం తగ్గుతుందన్నారు. ఫార్మసిస్టులు ప్రజలకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు సురక్షితమైన ఔషధ వినియోగం పెరుగుతుందన్నారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

గుంటూరు రూరల్: అర్ధరాత్రి ఆలయంలో హుండీలను పగలగొట్టి దుండగులు నగదు దోచుకెళ్లిన ఘటన శనివారం చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. మండలంలోని వెంగళాయపాలెం షిరిడీసాయినాథుని ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి దుండగులు ఆలయం తాళాలు తీసి ఆలయంలోని రెండు హుండీలను బయటకు తెచ్చి ఆలయ ప్రాంగణంలోనే పగలగొట్టి హుండీలలోని నగదును దోచుకెళ్లారు. తెల్లవారిన తరువాత ఆలయంలోకి వచ్చిన ఆలయ కమిటీ సభ్యుడు నరశింహారావు విషయాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో వివరాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.